
నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 74



# రోజంతా రచయితగానే ఉండాలి! నిరంతరం రాస్తూనే ఉండాలి!

- నిశాపతి

వృత్తి రీత్యా ఆయన ఇంజనీర్. చీఫ్ ఇంజనీర్ హోదాలో పదవీ విరమణ చేశారు. ప్రవృత్తి రీత్యా రచయిత. పరిచితమైన జీవన కోణాల నుంచే కథలు రాశారు. ఇప్పటివరకు 52 కథలు రాశారు. ఇంకా మూడు, నాలుగు పుస్తకాలు ముద్రణకు ఎదురు చూస్తున్నాయి. అసలు పేరు ఎం.హెచ్.వి.సుబ్బారావు. కలం పేరు 'నిశాపతి'. వారితో ఇంటర్వ్యూ ఈవారం.

నేను పుట్టినప్పుడు మా ఊరు గుంటూరు జిల్లాలో వుండేది. దరిమిలా ఊరు కదల్లేదు గాని, జరిగింది ప్రకాశం జిల్లాలోకి. ప్రకాశం జిల్లా అప్పుడే ఏర్పడ్డది. మా ఊరిపేరు 'వలపర్ల'. ఒంగోలుకీ గుంటూరికీ మధ్యన వుంది.

వృత్తిరీత్యా నేను సివిల్ ఇంజనీర్ని. రాష్ట్ర ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్ హోదాలో పదవీ విరమణ చేశాను. నా పేరు ఎం.హెచ్.వి.సుబ్బారావు. నా కలం పేరు 'నిశాపతి'.

నా శ్రీమతి వసుంధర బి.ఏ. దాకా చదువుకుంది. పెద్దమ్మాయి అరుణ వరంగల్‌లో వుంది. అల్లుడు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్. పేరు ఫణీంద్ర. తరువాత అబ్బాయి కిరణ్. అమ్మాయి పల్లవి అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో వున్నారు. కోడలు: నిత్య. అల్లుడు: శ్రీనాథ్.

### ఉమ్మడి కుటుంబం

మా నాన్నగారు మా ఊరి కరణంగా వుండేవారు. వాళ్లు ముగ్గురన్నదమ్ములు. నాకు 18, 20 ఏళ్లు వచ్చేదాకా అందరం కలిసే వుండేవాళ్లం. ఉమ్మడిగా ఓ 40, 50 ఎకరాల భూ వసతి వుండేది. ఎక్కువగా మెట్టపొలమే! వర్షాధారం! స్వంత వ్యవసాయం. గ్యారంటీ లేని ఆదాయం. రెండు జతల ఎద్దులు. రెండు గేదెలు, ఇద్దరు జీతగాళ్లు. అంతా అట్టహాసంగా వున్నా మేం బంగారం గొలుసుల ఉయ్యాల లూగలేదు. అలా అని దైనందిన జీవిత గమనంలో ఇబ్బందులు పడనూ లేదు.




### జీవితం ఓ సరళరేఖలా సాగిపోతూ వుండేది

మా ఇంట్లో ఓ మిశ్రమ వాతావరణం వుండేది. బుద్ధి జీవన సరళీ, చదువు సంధ్యా, మడీ ఆచారం ఓ పక్కా... వ్యావసాయక వాతావరణం, వ్యవహార ధోరణీ మరోపక్కా. కొంచెం అధికారం. దర్పం ఇంకో పక్కా... వుండేవి.

### మా ఇంట్లో చిన్న లైబ్రరీ ఉండేది

మా నాన్నగారు చిన్నప్పుడు 'అరేబియన్ నైట్స్' కథలు అనువాదం చేశారట గాని .... మొత్తం మీద మా ఇంట్లో సాహితీపరులెవరూ లేనట్లే లెక్కేసుకోవచ్చు. అయితే మా ఇంట్లో కొంత సాహితీ వాతావరణం, ఎలావుందో గాని వుండేది. రామాయణ భారత భాగవతాలు, 'సాక్షి' సంపుటాలు, కాశీమజిలీ కథలు, వేదం వారి ప్రతాపరుద్రీయ నాటకం, వెంకట పార్వతీశ్వర కవుల ప్రమదావనం నవల, వారివే మాయావి, మనోరమ, మాయవిని డిటెక్టివ్ సీరీస్, వరవిక్రయం నాటకం... ఇలా కొన్ని మంచి పుస్తకాలు వుండేవి. నేను రామాయణం అవీ తప్ప మిగతా పుస్తకాలన్నీ చదివేశాను, పది పది హేనేళ్ల ఆ వయసులోనే. పత్రిక, ప్రభ వీక్లీలు చదివినా మా ఇంట్లో కోప్పడే వారు కారు. బహుశా ఆ పఠనం నాలో కొంత సాహిత్యాభిలాష కలిగించి వుండొచ్చు. నరసరావుపేటలో ఇంటర్ చదివే రోజుల్లో మా తెలుగు 'ట్యూటర్' ఒకాయన చాలా భావుకతతో రాయడం, మాట్లాడడం చేస్తుండేవారు. అదీ కొంత ప్రభావం చూపివుండవచ్చు.

### అమ్మ ఆశీస్సు

మా అమ్మ పొద్దున పది గంటలకు మడికట్టుకుని వంట ప్రారంభిస్తే, ఇంట్లో భోజనాలు పూర్తయ్యే సరికి రెండయ్యేది. ఈ మధ్యకాలం అంతా ఆమె పని చేసుకుంటూనే, ఏవేవో దేవతాస్తోత్రాలు, ఒకటి తర్వాత ఒకటి, చదువుతూనే వుండేది. మధ్యాహ్నం 'లంచ్' తరువాత, పైట చెరగు తలగడపై పడుకుని, భారతమో, భాగవతమో చదువుతుండేది. ఆ వాతావరణం కూడా నాకు దైవం పట్లా, అక్షరం పట్లా ప్రేమ ప్రసాదించిందనుకుంటాను.

### అంజనీ సుతా!

స్కూల్లో నాకు లాంగ్వేజెస్, లెక్కలు బాగా యిష్టమైన సబ్జెక్టులు. ఆ చిన్న ఊరి స్కూల్లో అన్ని సబ్జెక్టుల్లో నావే ఫస్ట్ మార్కులు. నేను మూడో ఫారంలో వుండగా కాబోలు మా తెలుగు మాష్టారొకాయన మాతో ఓ పద్యం రాయించాలని చాలా ముచ్చటపడ్డాడు. ఛందస్సు నూరి పోసీపోసీ, చివరకు ఒక రోజు, ఆంజనేయస్వామిపై ఓ పద్యం రాయించే సాహసానికి పూనుకున్నాడు. ఆయనో మాట రాస్తే, మేమో మాట అందించాలి. మాలో ఒక్కరికీ నోరు పెగిలి చావడం లేదు. పాపం, పద్యం నాలుగు పాదాలూ ఆయనే నడిపించాడు. చివరి లైనుకొచ్చింది. ''మముగావుము ప్రేమతో...' అని రాసి, ఈ చివరి రెండు గణాలైనా చెప్పేడవంధ్రా అన్నారు దుఃఖంతో. అప్పుడు 'అంజనీ సుతా!' అని అందించి, మా మేష్టార్ని సంపూర్ణ పరాజయం నుండి కాపాడిన 'మహాకవి'ని నేనే! ఇదీ నా పద్యం నేపథ్యం... ఇదే నా మొదటి రచన!

### అమ్మమ్మ పుణ్యమా అని రచయితనై పోయా!

నా మొదటి కథ ప్రహసనం కూడా యించుమించు ఇలాంటిదే! అదీ దాదాపు ఆ పీరియడ్‌లోనే జరిగింది. ఓసారి మా అమ్మమ్మ ఆరుబైటపడుకుని నిద్ర పోతోందట. ఓ రాత్రి వేళ మెలుకువ వచ్చి, చేతులకేసి చూసుకుని, 'ఇదేంటి' పొన్నుల్లాగా యింతలేసి మురుగులు చేతులకే పెట్టుకుని (లోపల దాచకుండా) ఇట్లా మొద్దు నిద్రకి పడ్డాను' అని 'ప్రకాశముగా' అని మళ్లీ 'స్వగతం'గా మొద్దు నిద్ర కంటిన్యూ చేసిందట. ఆ 'మోనోలాగ్' విన్న ఓ దొంగ ప్రహరీగోడదూకి చేతులకున్న మురుగులు కాస్తా లాక్కుని ఉడాయించాడట!

ఇది కథగా రాయొచ్చనిపించి పేపరూ, పెన్నూ పుచ్చుకున్నాను. చేతిరాతలో ఒకటిన్నర పేజీలు రాసి ఆంధ్రపత్రికకి పంపాను. స్టాంపులు పెట్టినా వెనక్కి రాలేదు.

అచ్చులో నా మొదటి కథ 1969లో వచ్చింది ఆంధ్రపత్రిక వీక్లీలోనే. చాలా పొంగిపొయ్యాను. కానీ మామూలుగా కథల్లో రాసినట్లు, అది అందరికీ చూపి ఆనందపడి పోలేదు. నేను కొంచెం 'ఇంట్రావర్టు'ని.

అప్పటి నించి ఇప్పటివరకు 41 ఏళ్లల్లో, నత్తల రథంపై సాహిత్య విహారం చేస్తూ 52 కథలు రాశాను. అవి మూడు సంపుటాలుగా వేసుకున్నాను. 'అభిశప్త' అనే బుల్లి నవలిక, 'కలకలం' అనే ఒక కవితా సంపుటీ, రెండు శ్రవ్య నాటికలు, రెండు శతకాలు, రెండు పద్య కావ్యాలు (మా అమ్మపై 'తల్లీ నిన్నుదలిచి...' అని ఒకటి, 'సాయిదర్శనమ్' షిర్డీ సాయిబాబాపై ఒకటి అచ్చైన నా పుస్తకాలు) ఓ వ్యాస సంపుటి అచ్చులో వుంది. ఇంకా 3, 4 పుస్తకాలు ముద్రణకు ఎదురు చూస్తున్నయ్. ఇవిగాక 'ప్రమిద' పత్రికలో 'పద్యాల పందిరి' పేరిట ప్రాచీన పద్యాల మాధుర్య వివరణ. 'ఆవలితీరం' అనే పత్రికలో 'స్మైల్ క్యాప్సూల్స్' అనే పేర 'జోక్స్'. ఇవి కొసరు. ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో 'పద చదరంగం' పేరిట, వీక్లీలో 'గడి నుడి గుంచం' పేరిట గళ్ల నుడి కట్లు... ఇవీ...

### ముందు పాఠకుణ్ణి

సంస్కృత కవుల్లో వాల్మీకి, కాళిదాసు ఇష్టం. తెలుగులో చాలామంది ఇష్టం. శ్రీకృష్ణ దేవరాయలంటే ప్రత్యేకాభిమానం.

'కలకలం' అనే కవితా సంపుటికీ 'నిశాపతి కథలు' కథా సంపుటికీ, 'తల్లీ నిన్ను దలంచి' పద్యకావ్యానికీ చిన్నచిన్న అవార్డులు వచ్చాయి. 'కాంతికిరణం' కథా సంపుటి గురించి ప్రా కవన శర్మగారు, కథల్లో వైవిధ్యం వుండడమే గాక, అన్ని కథలూ సంతృప్తి స్థాయిని అధిగమించాయని ప్రశంసించారు. 'వసుంధర' గారు ఒక మంచి పరిచయ వ్యాసం 'రచన' పత్రికలో రాశారు. ప్రస్తుతం

## ఇష్టమైనవి

| | | |
|---|---|---|
| సినిమా | : | శ్రీవారికి ప్రేమలేఖ, చివరికి మిగిలేది (ప్రభాకరరెడ్డి) ఏక్‌హీరాస్తా (అశోక్ కుమార్)... ఇంకా కొన్ని.. |
| నటుడు | : | సంజీవకుమార్ |
| నటి | : | సావిత్రి |
| పాటలు | : | చాలా. హిందోళీ, కాఫీ, కళ్యాణి రాగాల్లో వున్న సినిమా పాటలు, కొన్ని లలిత గీతాలు |
| గాయకుడు | : | ఘంటసాల, మన్నాడే |
| గాయని | : | జిక్కి, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి |
| నవలలు | : | మగువ మనసు (ధనికొండ హనుమంతరావు), చివరకు మిగిలేది (బుచ్చిబాబు), ఆఫ్ హ్యూమన్ బాండేజ్ (సోమర్సెట్ మామ్), మా బాబు (విశ్వనాథ)మనోవైజ్ఞానిక నవలలు: అల్పజీవి, అసమర్ధుని జీవయాత్ర |
| కవులు | : | తిలక్, శేషేంద్ర, సినారె, గోపీ, ఆశారాజు యింకా చాలామంది |
| కథకులు | : | మధురాంతకం రాజారాం, వాకాటి పాండురంగారావు, మునిపల్లె రాజు. |
| పరిశోధకులు | : | అక్కిరాజు రమాపతిరావు |
| వాద్యం,వాద్యకారుడు: | | ఫ్లూట్, టి.ఆర్.మహాలింగం |
| బంధువు | : | మా బావగారు కీ.శే. మురళీధరశర్మ |
| ప్రదేశం | : | మా ఊరే! నయాగరా జలపాతం గూడా. |
| వంట | : | అప్పుడు మా అమ్మ, ఇప్పుడు మా ఆవిడ చేసే కాకరకాయ వేపుడు. |

'ఆంధ్ర పద్య కవితా సదస్సు' ప్రధాన కార్యదర్శిగా, అది నడిపే 'సాహితీ కౌముది' సంపాదకుడిగా వున్నాను.

ఏదైనా ఓ కథ రాశాక, నేను దాన్ని ఏడెనిమిది సార్లు చదువుకుంటాను. చదివిన ప్రతిసారీ ఏదో దిద్దుతూనే వుంటాను. అప్పుడేదో 'ఫర్‌ఫెక్షన్' వచ్చేస్తుందని కాదు గాని, నా కలా అలవాటయింది. ఫెయిర్‌కాపీ దాకా వచ్చిన కథలన్నీ అచ్చయ్యాయి. కథ అచ్చయినప్పుడల్లా, ఆ కథలో 'కరెక్షన్స్'కి కారణభూతుడైన నాలోని పాఠకుణ్ణి. నేనే అభినందించుకుంటాను. ముందు 'మంచి' పాఠకుడైతే, తరువాత 'ఓ మాదిరి' రచయిత అయినా అవడానికి అవకాశం వుంటుందని అనుకుంటాను.

### తెలిసిందే రాశాను

నేను నాకు పరిచితమైన జీవితకోణాల గురించే కథలు రాశాను. తెలీని వాటి జోలికి పోలేదు. మధ్య తరగతి జనాల ఆత్మీయతలు, చిన్నచిన్న త్యాగాలూ, స్వార్ధాలూ, నిస్సహాయతలు నన్ను ఆకర్షించే కథాంశాలు. ముఖ్యంగా మనిషి 'నిస్సహాయత' – హ్యూమన్ బాండేజీ – కదిలించినంతగా నన్ను మరేదీ కదిలించదు. తరువాత నా కిష్టమైంది హాస్య కథలు రాయడం.







### సామాజిక స్పృహ నాకూ ఉంది

మధ్యతరగతి మందహాసాలే నా చాలాకథల్లో ఇతివృత్తాలైనా, ఆర్థిక అసమానతల గురించి శ్రమదోపిడీ గురించి నేను అసలు పట్టించుకోకుండా వుండలేదనుకుంటాను. 'దోపిడీ' అనే 'టర్మ్' 'రిలెటివ్' అనీ, అంతేగాక అదో 'ఛెయిన్' అనీ కూడా నేను అనుకుంటూ వుంటాను.

ఈ సమస్య మూలాల్లోకి పోయి ఆలోచించగల వ్యవస్థలు రెండే రెండు నాకు కనిపించాయి. ఒకటి భారతీయ తత్త్వ చింతన. రెండు 'ప్యూర్' మార్క్సిజం. రెండూ గొప్పవ్యవస్థలే! కాని మనిషిలో సహజసిద్ధంగా దోపిడీ 'చేయబడేందుకు' వున్న వ్యతిరేకత దోపిడీ 'చేసేందుకు' వుండదు. అసలు తనుచేసే దోపిడీకి అతను ఎంత అలవాటు పడిపోతాడంటే తను దోపిడీ చేస్తున్నట్లు కూడా అతనికి తెలీదు. ఆ భావనకు కారణమైన 'జీన్స్' ఏవో కనిపెట్టి, అవి ఏరేస్తే తప్ప, ఎంత గొప్ప వ్యవస్థ అయినా పాక్షిక ఫలితాల్నే యిస్తుందేమో అనుకుంటాను.

కాని, అలా అని, అంతా కాలానికి విడిచిపెట్టి ఊరుకోలేం. ముఖ్యంగా కవీ, రచయితా అన్నవాడు అసలు ఊరుకోలేడు. అందుకే పీడితులుగా తనకి బాగా 'ఎపీల్' చేసిన లేదా తనకి బాగా 'పరిచయమున్న' వర్గాన్ని – స్త్రీలు, దళితులు, కార్మికులు... ఇలా ఏదో ఓ దాన్ని సమర్థిస్తూ అతను కవితలు రాస్తాడు. కథలు రాస్తాడు. సమాజాన్ని అతడు చూసే దృష్టి కోణం 'పాక్షికం' కావచ్చు గాని అతని నిజాయితీ, 'కన్విక్షన్' మాత్రం సమగ్రం.అలా, నేను రైతుల పక్షం వహించి కొన్ని కథలు రాశాను. ఆత్మహత్యలు అవసరం లేని పరిస్థితులు కల్పించకుండా, 'ఎక్స్‌గ్రేషియో'లిస్తోంటే, ఆ ప్రలోభం సృష్టించే కొన్ని వికృత ఫలాల్ని 'ఈ పాపం ఎవరిది?' అన్న కథలో చర్చించాను. అలాగే రిజర్వేషన్లలో లొసుగులూ, వాటితో రాజకీయ నాయకులు ఆడే ఆటలు 'వినండి మనుషుల గోల' కథలో వర్ణించాను. అధోజగత్సహోదరుల గురించి రాసిన కథ 'బ్రిడ్జి'కి అవతల. 'ఏడెనిమిది హాస్య కథలు.. ఒకే రకం ఇతివృత్తంతో పదే పదే కథలు రాస్తే 'పాపులర్' కావచ్చేమో గాని ఎందుకో నాకది పట్టుబడలేదు.

నాకు చాలా రాయాలనే కాంక్ష వున్నా, రాసింది చాలా తక్కువ. దానికి నేను నన్ను తప్ప ఎవర్నీ నిందించలేను.

నిరంతర రచనాసక్తీ రచనాశక్తీ వున్న యువ రచయితలకు నా సలహా, ఎప్పుడో ఓసారి శ్రీశ్రీ చెప్పిందే. ''రాస్తూ వుండండి. అద్భుతమైన యితి వృత్తం మీ బుర్రలో ఎప్పుడు మెరుస్తుందో చెప్పలేం. అప్పటికి మీరు రాసి, రాసి శైలికి మెరుగు పెట్టుకుని – Like a well Oiled Engine – ఉండకపోతే రాణించలేరు'' అన్నాడు. 'సోమర్సెట్‌మాం' గూడా తన ఆత్మకథలో యిదే చెప్పాడు. ''రచయిత అనేవాడు రాసే క్షణాల్లోనే కాదు, ఆలోచించేటప్పుడు, చదివేటప్పుడు, అనుభవాలు పొందుతున్నప్పుడు, ఎప్పుడూ రోజంతా రచయిత గానే వుండాలి. నిరంతరం రాస్తూండాలి'' అని. ఈ రోజుల్లో రచయితకు 'వాసి' ఎంత ముఖ్యమో, రాశి గూడా అంతే ముఖ్యం!

ఈ విషయంలో నేను కొంత వెనుకబడ్డాను. నా జూనియర్ మిత్రులు నా అనుభవం నించి పాఠాలు నేర్చుకుంటారని ఆశిస్తున్నాను.

– సామ్రాట్

నాకు నచ్చిన నా కథ

# నేతిగిన్నె

- నిశాపతి

''కలలు బాగున్నప్పుడు మెలకువ కంటే నిద్ర బాగుంటుంది. ఇది జీవితంలోని కలలకూ వర్తిస్తుంది.

-వసుంధర


''గతం నీలో జీవించాలి కాని నువ్వు గతంలో జీవించకూడదు. మొదటిది ఆనందాన్నిస్తుంది. రెండోది దుఃఖాన్నిస్తుంది'' అన్నాడు వేణుగోపాలరావు.

తాతయ్య ఇలా కొటేషన్లతో మొదలెడితే ఏదో విషయం వుందని మనవళ్ళందరికీ తెలుసు.

అందుకే, ''తాతయ్యా! ఏదైనా కథ చెప్పు'' అంటూ అయన్ని చుట్టు ముట్టారు.

'సరే వినండి' అంటూ మొదలెట్టాడు వేణుగోపాలరావు.

పల్లెటూరు.



1950.

ఉదయం పది గంటల వేళ.

పిల్లలంతా చద్దన్నాలు తింటున్నారు.

వంటింటి కానుకుని భోజనాలు చేసే వసారా వుంది. వసారాకి కాస్తంత యిసింటా ఆరుబయల్లో కాకులు గోలగోలగా అరుస్తున్నాయి.

అన్నాలు తినే పిల్లలు కాకుల్ని చూసి, ''కాకెమ్మ కాకెమ్మ కలవారి కాకెమ్మ నీ కాలికి గజ్జె కడతా నీ నోట్లో వెన్న పెడతా మా యింటికి చుట్టాలొస్తే ఎగిరి గంతెయ్'' అంటున్నారు.

ఎందుకెగిరిందో గాని ఓ కాకి ఎగిరింది.

'చుట్టాలొస్తారు. చుట్టాలొస్తారు' పిల్లలంతా ఆనందంగా అరిచారు.

మధ్యలో ''బామ్మా! నెయ్యి'' అన్నాడు గోపీ.

''ఇదిగో తెస్తున్నా!'' అంటూ నేతి గిన్నె తెచ్చి అందులో వున్న పేరిన నెయ్యిని చూపుడు వేలుతో తీసి అతని కంచంలో బోలెడంత వేసింది వాళ్ల బామ్మ.

''నాకు పేరిన నెయ్యి వద్దు'' పేచీ పెట్టాడు గోపీ.

''నీ మొహం! పేరిన నెయ్యి ఎంతకమ్మగా వుంటుంది? పైగా ఎంత బలం? తిను అరవకుండా'' అంది వాళ్ళ బామ్మ.

''నాకు కరిగిన నెయ్యే కావాలి'' మంకుపట్టు పట్టాడు గోపీ.

బామ్మ రూటు మార్చింది.

''ఇవాల్టికి తిను నాయనా! రేపు కరగబెట్టి వేస్తాగా? చూడు! అమ్మ ఇంకా మడి కట్టుకోలేదు. పొయ్యి రాజెయ్యలేదు. నిప్పు ఎక్కడినించి వస్తుంది? అసలే చలికాలం. ఎండలో పెట్టినా నెయ్యి కరగదు'' అంది.



''కాయితం కాల్చి కరగబెట్టు''

''తప్పురా! కాయితం సరస్వతి! పోయిన జన్మలో ఏ పాపం చేశానో, ఈ జన్మలో ఆడపుటక పుట్టి చదువుకు నోచుకోలేదు. కాయితాలు కాల్చి వచ్చే జన్మలో గూడా యిలా మొద్దుగా పుట్టమంటావా?'' అంది బామ్మ.

గోపీ కాసేపు నెయ్యి గొడవ మరచిపోయి, ఆశ్చర్యపోతూ–

''నీకు చదువు రాదా! మరి రోజూ గంటలు గంటలు మంత్రాలు చదువుతావు గదే!'' అన్నాడు.

''పిచ్చి నాన్నా! అవి మంత్రాలు కాదురా, స్తోత్రాలు''.

''అంటే''

''స్తోత్రాలంటే స్తోత్రాలే! దేవుడి స్తోత్రాలు! మా నాన్న చదువుతూంటే విని నేర్చుకున్నాను'' అంది బామ్మ.

ఇంతలో పిల్లలంతా ''ఏ.... ఏ.... ఏ... ఏ...'' అంటూ కోర్‌సలో కేకలు మొదలెట్టారు.

బామ్మ ఏమిటన్నట్టు వాళ్ళవైపు చూసింది.

''కాకి... కాకి... నేతిగిన్నె ఎత్తుకుపోయింది'' అన్నారు వాళ్ళు.



ఆదమరుపుగా ఉన్న మనిషిని వెనకనించి ఎవరో దబ్బనంతో గుచ్చితే ఉలిక్కిపడ్డట్లు ఉలిక్కిపడింది బామ్మ.

''సీతారావుడూ!'' అని బిగ్గరగా కేక పెట్టింది ముందు వసారాలో కూచుని లెక్కలు రాసుకుంటోన్న తన కొడుకుని.

ముందు వసారాలో వాలుబల్ల కింద కాళ్లు బార్లా చాపి కూచుని బల్లమీద వున్న రిజిష్టరులో వూళ్లో పైర్ల సాగుబడి వివరాలు నోట్ చేస్తోన్న సీతారామయ్యగారు ఆ కేక విని పరుగు పరుగున లోపలికి వచ్చారు. ఆయన కరణం గుమస్తా. అంతా కరణంగారనే అంటారు.

'కాకి నేతి గిన్నె ఎత్తుకెళ్ళింది' అని చెప్పింది బామ్మ. 'రావణాసురుడు... సీతని ఎత్తుకెళ్ళాడు' అన్నలెవల్లో.

దుష్ట సంహారానికి శ్రీరామచంద్రుడు విల్లందుకున్నట్లు సీతారామయ్యగారు కర్ర పుచ్చుకుని స్వయంగా బయలుదేరారు కాకిని 'ట్రేస్' చేస్తూ.

కాని ఆయన గుమ్మం దాటే లోపలే కాకి మాయమయింది.

గోపికలు చెట్టునీ పుట్టనీ శ్రీకృష్ణుని జాడ అడిగినట్లు, ఆయన దారిన పోయే వాళ్ళందర్నీ వాకబు చెయ్యడం మొదలెట్టారు.

''నా కాళ్ళకాడే పడేసిందయ్యగారూ! వంగి తీసేలోపులోనే మళ్ళీ ముక్కున కరుచుకు పోయింది''.

''తూర్పువేపుగా పోతూంటే చూశానయ్యగారూ!''

''ఫలానా వాళ్ళ చూరుగోడకేసి వెళ్తూంటే చూశానండీ'' ఇలా రకరకాల సమాధానాలు వస్తున్నాయ్.

ఇంతలోనే, ముక్కున నేతిగిన్నెతో కాకి ఆయన కంట బడింది. అది వెళ్ళే దిక్కునే దానితోపాటుగా పరుగు మొదలెట్టారు ఆయన.

కాకి గిన్నెను సిద్ధాంతిగారి మదురు గోడమీద పెట్టి నేతిని ముక్కుతో పొడుచుకుతింటోంది.

సీతారామయ్యగారు దొడ్డిగుమ్మం గుండా సిద్ధాంతి గారింట్లో ప్రవేశించారు. హఠాత్తుగా తన పెరట్లో కరణంగారిని చూసి విస్తుపోయాడు సిద్ధాంతి.

''ఏమయింది?'' అని అడిగాడు.

''కాకెత్తుకెళ్ళింది. గిన్నె నేతిది... నేతిది'' అని గట్టిగా అరిచి చెప్పారు సీతారామయ్యగారు. సిద్ధాంతి గారికి బాగా చెవుడు.

''మా బాగా శలవిచ్చారు. పరబ్రహ్మ స్వరూపాన్ని మనవాళ్ళు 'నేతి' 'నేతి' అనే గదా చింతనచేశారు. ఇన్నాళ్ళకి బావగారి మనసు వేదాంతం వైపు మళ్ళింది'' అన్నాడు సిద్ధాంతి.

''నా పిండాకూడు మళ్ళింది. నీ శ్రాద్ధం మళ్ళింది. బంగారం లాంటి గిన్నె పోయి నేను అఘోరిస్తుంటే..'' అన్నారు సీతారామయ్యగారు చిరాకు

పడుతూ.

ఇంతలో కాకి గిన్నె కరుచుకుని మళ్ళీ ఆకాశం వైపు వెళ్ళింది.

సీతారామయ్యగారు దాన్ని వెంబడించారు.

కాకి మళ్ళీ ఓ యింటి మీద వాలింది.

సీతారామయ్యగారు వేగంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి, మరో ఆలోచన లేకుండా ఆ గుమ్మం తలుపు తోసుకుని లోపలి ప్రవేశించారు.

సీతారామయ్యగారు ఇంట్లో ప్రవేశించే లోపునే ఆ యింటి యజమాని కాకి దురాగతాన్ని పసిగట్టి, అది నేయి తింటూన్న తన్మయత్వంతో ఏమరు పాటుగా వున్న క్షణం చూసి ఓ చిన్నరాయి విసిరాడు. కాకి బెదిరి గిన్నెని వదిలి ఎగిరిపోయింది. అదే అదనుగా తీసుకుని అతను పక్కనే వున్న ముల్లుగర్రతో ఆ నేతిగిన్నెని మదురు గోడమీంచి కిందికి పడేసి, ఆ గిన్నెని చేత్తో పట్టుకుని పరిశీలిస్తున్నాడు, దాని యజమాని ఆనవాళ్ళకోసం.

అదుగో, సరిగ్గా ఆ క్షణంలోనే లోపలికి అడుగు పెట్టాడు సీతారామయ్య గారు. నేతిగిన్నె చేతిలో పట్టుకుని వున్న పెద్దమనిషిని చూడగానే ఆయన అప్రయత్నంగా ''సాంబా'' అన్నారు. ఆ పిలుపువిని కొన్ని యుగా లైనట్లుగా ఉలిక్కిపడుతూ ''అన్నయ్యా'' అన్నాడు సాంబశివరావు. ఒకరి కళ్ళల్లో నీళ్లు మరొకళ్ళకి కనిపించకుండా యిద్దరూ చెరొక వైపుకి తిరిగారు.

ఆస్తి గొడవల్లో వచ్చిన తగాదాల్లో ఆ అన్నదమ్ములిద్దరూ మాటలు మానేసి పదేళ్ళయింది.

సన్నివేశాన్ని ఆకళింపు చేసుకున్న సాంబశివరావు భార్యా, ''బావ గార్ని పెరట్లోనే నిలబెట్టి మాట్లాడతారా? లోపలికి తీసుకొచ్చి మనవరాల్ని చూపించరా?'' అని మాట కలేసింది.

''రా! అన్నయ్యా!'' అని ఆహ్వానించాడు సాంబశివరావు. సీతారామయ్య గారు మారు మాట్లాడకుండా లోపలికి నడిచారు. సాంబశివరావు ఆయన్ని వుయ్యాల దగ్గరికి తీసుకెళ్ళి తన మనవరాల్ని చూపించాడు.

''గాయత్రి కూతురు. మొన్ననే దాని అన్నప్రాశన జరిగింది. పెద్దవారు మీ ఒళ్ళో కూర్చుని జరిపించుకునే యోగం దానికిలేదు'' అంది సాంబశివ రావు భార్య.

సీతారామయ్యగారు వెంటనే తన మెళ్ళో వున్న గొలుసు తీసి పసిదాని మెళ్ళో వేశారు.

''వద్దు బావగారూ! అక్కయ్యని నేనన్న మాటలకి ఆమె నన్ను క్షమించదు. ఈ గొలుసు దీనికిచ్చారని తెలిస్తే నేనే ఏదో మాయమాటలు చెప్పి కాజేశాననుకుంటుంది'' అంది సాంబశివరావు భార్య.

''లేదమ్మా! మీ అక్కయ్యకి యిప్పుడు నీ మీద కోపం లేదు. ఏమూలో కాస్త వున్నా అది మనవరాలి మొహం చూడగానే పోతుంది. ఆడపిల్లలంటే దానికెంత యిష్టమో నీకు తెలుసుగా! గాయత్రి వాళ్ళ పెద్దమ్మ ఒళ్ళోనేగా పెరిగి పెద్దదయింది. ఇంతెందుకు? రాత్రి భోజనానికి వచ్చినప్పుడు నువ్వే చూస్తావుగా?'' అన్నారు. సీతారామయ్య గారు.

'భోజనానికా!' అంది ఆశ్చర్యంగా ఆమె.

''ఏం రావా?''

''అయ్యో! ఎంతమాట? తప్పకుండా వస్తాం. యిద్దరం'' అంది.

''అలా ఆ కాకి పదేళ్ళ బట్టి విడిపోయిన రెండు కుటుంబాల్ని కలిపింది'' అని ముగించాడు వేణుగోపాలరావు.

***

''ఈ కథలో గోపీవి నువ్వే! నాకు తెలుసు'' అన్నాడు రాము. అతను పిల్లలందరిలోకీ పెద్దవాడు. ఈ సంవత్సరమే ఇంజనీరింగులో చేరాడు.

''ఎలా చెప్పగలవు?''

''పేరిన్నెయ్యి వద్దని పేచీ పెట్టే అలవాటు నీకిప్పటికీ వుందట. అమ్మమ్మ చెప్పింది'' అన్నాడు రాము.

''గుడ్ రీజనింగ్. మైడియర్ వాట్సన్!'' మెచ్చుకున్నాడు వేణుగోపాలరావు. అతనిలో ప్రత్యేకత అదే! కుర్రాళ్ళలో కుర్రాడిలా కలిసి పోగలడు.

''అది సరేగాని తాతయ్యా! వెధవ నేతిగిన్నె కోసం అలా యిల్లిల్లూ తిరుగుతారా ఎవరైనా? ఆఫ్‌ట్రాల్ ఎంతవుతుంది అది?'' అన్నాడు రాము.

వేణుగోపాలరావు పక్కనే బల్లమీద ఆల్విన్ టాఫ్లర్ రాసిన 'ఫ్యూచర్ షాక్' అనే పుస్తకం ఉంది. అది తీసి మనవడి చేతిలో పెట్టి ''ఈ బుక్కు చదువు. వాళ్ళు నీ కర్థం అవుతారు'' అన్నాడు.

''చదివాను తాతయ్యా! వెనుకటి తరం వాళ్లు జీవితాన్ని ప్రేమించే వాళ్ళు. మనుషులే గాదు, వస్తువుల్నీ ఓ పట్టాన వదలగలిగేవాళ్ళు కారు. పనికి రాకపోతే ఓ మూల అటకమీద పడేసైనా వుండేవారు గాని... ఆ నేతి గిన్నెలో వాళ్ళు అస్పష్టంగా తమ జీవితాల్లో వివిధ ఘట్టాల్నీ, ఐడెంటిఫై చేసుకున్నారు అందుకే అంత 'అటాచ్‌మెంట్!' అదేనా తాతయ్యా, నువ్వు చెప్పదలుచుకున్నది.'' అన్నాడు రాము.

వేణుగోపాలరావు చురుగ్గా కళ్ళెత్తి, ''ఏం, అది నీకు గొప్ప విషయంగా కనబడ్డం లేదా?'' అన్నాడు.

రాము ఆయన చూపుల్ని తప్పించుకుంటూ మాట మార్చాడు.

'మరి యీ దేశం మీద, నీ బాల్యస్మృతుల మీద యింత మమకారం వున్న వాడివి ఆ అమెరికా వదిలిపెట్టి ఎందుకు రావు తాతయ్యా! నువ్వూ, మామయ్యా అలా అమెరికాలో సెటిలైపోయాక అమ్మ యిక్కడ ఎంత ఒంటరిగా ఫీలవుతోందో తెలుసా? తనకి పుట్టిల్లు దూరం అయిందని అమ్మ మనసులో ఎంతదిగులో తాతయ్యా, పైకి చెప్పుకోదు కాని. ఇక ఇండియా వచ్చెయ్యరాదూ, చాలా డబ్బు సంపాయించావుగా?'' అన్నాడు రాము.

''అందుకే గదరా, యింత వయసు వచ్చినా ప్రతి సంవత్సరం ఇండియా వస్తోంది. నీకు తెలీదు రామూ! ఇండియా వచ్చేస్తే కల చెదిరిపోతుంది. ఇందాక నువ్వన్నావే! ఆ నేతిగిన్నె లాంటివేరా యీ అనుబంధాలు. వాటి గురించిన నిజాలకన్నా ఊహలే మధురమైనవి. ఈ ఆత్మీయతల్నీ, అనుబంధాల్నీ 'క్వాంటిఫై' చేసి మెటీరియల్ జీవితంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించావా, ఈ వస్తు ప్రపంచంలో వుండే దుర్గుణాలన్నీ వాటికి సంక్రమిస్తాయి. ఒకసారి వాటిని డాలర్లలో కొలవడం మొదలెట్టాక, అవి చాలా నిష్ప్రయోజనమైనవిగా కనిపించి, వాటి చుట్టూ వుండే ఆర్ద్రత అనే పొర కరిగిపోతుంది. నువ్వడగొచ్చు. మరి యింత బలహీనమైన సెంటి మెంట్లకి ఎందుకింత విలువివ్వడం? అని. అదంతే! కొన్ని ప్రశ్నలకి సమాధానాలుండవ్'' అన్నాడు వేణుగోపాలరావు.

దూరంగా ఎక్కడో గంగిరెద్దులవాడు సన్నాయి మీద 'దంచవే మేనత్త కూతురా' అని వాయిస్తున్నాడు.

– రచన మాసపత్రిక, ఆగస్టు 2005

## లాజిక్కుకి అందని స్పందన



మనసులో మొలకెత్తే కొన్ని స్పందనలకు లాజిక్కు ఉండదు. ఆ అర్థతాభావం ఎవరి గుండెల్లో తలెత్తుతుందో వాళ్ళకది అపురూపం. దానికి ''వాల్యూ'' ఉంటుంది గానీ ''ప్రైస్'' ఉండదు. అది వైయక్త ఆహ్లాదం. ఈ సత్యానికి నా చిన్నప్పుడు తరచు కంటబడే ఓ ముచ్చటైన దృశ్యం ఆలంబనగా చేసుకుని ఈ కథ రాశాను.

– నిశాపతి

98483 30708